

కలెక్టర్ల సదస్సుకు హాజరైన ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్లు వెంకటమురళీ, అరుణ్‌బాబు, నాగలక్ష్మి

ప్రణాళికతో లక్ష్యాలు సాధించండి

- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కలెక్టర్ ఒక విజన్ 2047ని తయారు చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే ప్రతీ 100 రోజులకు ఒక కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రైవేటు ప్రభుత్వ భాగాస్వామ్యానికి హద్దు లేదన్నారు. ఏ విషయంలోనైనా ఈ విధానాన్ని అమలు చేయవచ్చని సూచించారు. కొత్త ఆలోచనలు చేసి పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కొన్ని అంశాలపై సీఎం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.

వెనకబడిన వర్గాలకు ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. దీనిని కొనసాగించాలి. అలానే అర్హత ఉండి ఇంకా ఎవరైనా మిగిలిపోయి వుంటే వారిని కేంద్రం అమలు చేయబోతోన్న కొత్త పథకం కింద అర్హులుగా చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి సూచించారు. ఇళ్ల నిర్మాణానికి గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేసుకొని అందుకు అవసరమైన ఇసుక, ఇనుము తదితర సామాగ్రి అంతా ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేయాలన్నారు. ప్రధానంగా రాబోయే 11 నెలలు ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. గుంటూరు జిల్లాకు పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ కింద 1,00,540 ఇళ్లు మంజూరైతే గత ఐదేళ్లలో కేవలం 23,176 మాత్రమే పూర్తి చేశారు. అసలు నిర్మాణమే ప్రారంభం కాని ఇళ్లు 36,404 ఉన్నాయి. పురోగతిలో మరో 40,958 ఉన్నాయి. గ్రౌండింగ్, స్టేజ్ కన్వర్షన్‌లో గుంటూరు జిల్లా బాగా వెనకబడి వుందన్నారు. అలానే మౌలిక సదుపాయాల కల్పనలోనూ వెనకంజలో ఉందని చెప్పారు. ఎవరైతే అనర్హులు, లబ్ధిదారుల జాబితాలో ఉన్నారో వారందరిని తీసేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని వారిని పిలిచి మాట్లాడి ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే భవిష్యత్తులో ఆ అవకాశాన్ని కోల్పోతారని చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త స్కీమ్ తీసుక రాబోతోన్నదని, దీనికి రూ.4.30 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారన్నారు. అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇస్తామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే దరఖాస్తులకు ఆ స్కీమ్ ద్వారానే లబ్ధి చేకూరుస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్‌లో ఉప కార్యక్రమమైన ఛాలెంజ్ బేస్డ్ డెస్టిని డెవలప్‌మెంట్(సీబీడీడీ) కింద నాగార్జునసాగర్‌లో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలో ఒక ఆర్‌టీజీఎస్ సెంటర్‌ని 60 రోజుల వ్యవధిలో ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గుంటూరు-బాపట్ల 42 కిలో మీటర్లు, మంగళగిరి - తెనాలి - నారాకోడూరు 40 కిలో మీటర్ల రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించామన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50 ఎకరాల ఖాళీ స్థలాన్ని పీపీపీ విధానంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు వంటి వాటికి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో సీఎం సమావేశం నిర్వహించారు. సంపద సృష్టి జరగాలంటే తొలుత శాంతి భద్రతలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు సమన్వయంగా ముందుకుపోవాలి. నేను స్వతంత్రం అన్న ఆలోచన ఇద్దరిలోనూ కలగరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో సీసీ టీవీలు అమర్చాలి. అలానే ప్రైవేటు ప్రదేశాల్లో వాటి యజమానులతో సీసీ టీవీలు ఏర్పాటు చేయించి వాటిని ప్రభుత్వ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. గంజాయిని పూర్తిగా అదుపు చేయాల్సి ఉన్నది. ఇళ్లల్లోనూ వాటిని పెంచుతున్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి వాటిని పసిగట్టి ముందు ఉత్పత్తిని నియంత్రిస్తే ఆటోమేటిక్‌గా వాడకం అదుపులోకి వస్తుందన్నారు. సోషల్ మీడియాలో జరుగుతోన్న ఫేక్ ప్రచారాలను అరికట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాకు ఒక ఐటీ నిపుణుడిని పంపిస్తామన్నారు.

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై కూడా...

జిల్లాలో పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు ఉండడంతో గడచిన ఐదేళ్లలో వాటి విషయంలో జరిగిన అవకతవకలపై సీఎంతో సమావేశంలో చర్చకు రాగా వాటన్నింటిపై పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. భూముల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారెవరు ఎంతటి వారైనా చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడవద్దని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

ఫేక్ ప్రచారంపై చర్చ

ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని దానికి ఉదాహరణగా తాజాగా బాపట్ల జిల్లా భట్టిప్రోలులో జరిగిన ఉదంతాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తావించినట్లు సమాచారం. భట్టిప్రోలు ఘటనలో టీడీపీ కార్యకర్త ఒకరు ఎస్‌ఐ చొక్కా పట్టుకున్నట్లు జరిగిన ఫేక్ ప్రచారం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై మరుసటి రోజే ఆ తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ రేపల్లె డీఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసిన విషయాన్ని కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సరైన ఆధారాల్లేకుండా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఇచ్చినట్లు జిల్లా అధికారులు సీఎంకి వివరించినట్లు తెలుస్తోంది. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్యలను నివారించడంతో పాటు బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం ప్రస్తుత పరిస్థితి, నిధుల లభ్యత పెండింగ్ తదితర అంశాలు కలెక్టర్ల సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది

ఇన్‌చార్జిల పాలనలో.. ఆర్టీసీ

- బాపట్ల ఇన్‌చార్జ్ డీపీటీవోగా గుంటూరు డీపీటీవో రవికాంత్
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు డిపోల్లోనూ ఇదే పరిస్థితి...
- ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలంటోన్న ఉద్యోగ సంఘాలు



గుంటూరు, ఆగస్టు 5: ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జ్‌ల పాలనలో నడుస్తోంది. కొన్ని రోజులుగా నాలుగు డిపోలకు వేరొక డిపోల డీఎమ్‌లే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తద్వారా పాలన కుంటుపడటంతో పాటు అధికారులు రాకపోకలతోనే సరిపోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న ఆర్టీసీ, ఇన్‌చార్జ్‌ల పాలనతో మరింత దిగజారే పరిస్థితి నెలకొందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విభజిత గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న ఎమ్ రవికాంత్ బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జ్ డీపీటీవోగా వ్యవహరిస్తున్నారు. ఆర్టీసీ బాపట్ల జిల్లా పరిధిలో బాపట్లతో పాటు చీరాల, పర్చూరు, అద్దంకి డిపోలున్నాయి. గుంటూరు నుంచి బాపట్ల రాకపోకలు సాగించటంతో పాటు సమీక్షా సమావేశాలు నిర్వహించటం కూడా ఆయనకు తలకు మించిన భారంగా మారుతోంది. మరోవైపు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎమ్)గా వ్యవహరిస్తున్న కె సత్యనారాయణను మంగళగిరి డిపో ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏటీఎమ్ మంగళగిరి డిపో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండటంతో బస్టాండ్‌లో పర్యవేక్షణ లేకపోవటంతో కొందరు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. జిల్లా కేంద్రం గుంటూరు బస్టాండ్‌లో ఏటీఎమ్ పోస్టు ఎంతో కీలకమైనది. బస్సుల పర్యవేక్షణతో పాటు వాణిజ్య సంబంధమైన పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆయన ఇన్‌చార్జ్‌గా అక్కడే ఎక్కువ సమయం కేటాయించటంతో పాటు ఇక్కడ సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవటంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక తెనాలి డిపో మేనేజర్ ఏ రాజశేఖరనాయక్ రేపల్లె డిపో ఇన్‌చార్జ్ డీఎమ్‌గా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు డిపో మేనేజర్ అజితకుమారి బాపట్ల డిపోకు ఇన్‌చార్జ్ డీఎమ్‌గా పనిచేస్తున్నారు. సత్తెనపల్లి డిపో మేనేజర్ జీవీఎస్ కుమార్ పిడుగురాళ్ల డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా ఇన్‌చార్జ్ మేనేజర్లతో డిపోలలో పాలన కూడా కుంటు పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డిపోలలో నిత్యం సిబ్బంది విధులతో పాటు పాలనా వ్యవహారాలు, రోజువారీ గ్రీవెన్స్ కూడా ఇబ్బందులు పడుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయా డిపోలలో మేనేజర్లు పదవీ విరమణ చేయటంతో ఖాళీ అయిన పోస్టుల్లో కొన్ని రోజులుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తుండటం ఆర్టీసీలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న ద్వారకా తిరుమలరావు ఆర్టీసీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇలా ఆర్టీసీ ఇన్‌చార్జ్‌ల పాలనతో మరింత కుంటు పడుతుందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీ నెరవేరాలంటే ఇన్‌చార్జ్‌ల పాలన లేకుండా పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.





నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

తెరుచుకున్న సాగర్ గేట్లు

- 16 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- సాగర్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి
- ఇన్‌ఫ్లో 3,23,331.. ఔట్‌ఫ్లో 1,63,220 క్యూసెక్కులు
- డ్యాం వద్ద పర్యాటకుల సందడి

నరసరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ నిండు కుండలా ఉంది. జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యాంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరడంతో 16 గేట్లు ఎత్తి దిగువకు 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ కలెక్టర్ నారాయణ రెడ్డి, జలవనరుల శాఖ సీఈ నాగేశ్వరరావు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి మొత్తం 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 7 గంటలకు 3,23,610 క్యూసెక్కుల వరద నీరు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 584.20 అడుగులకు నీటి మట్టం చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు గాను 295.12 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 1,63,332 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,516 క్యూసెక్కులు మొత్తం 2,03,848 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో జలాశయం దిగువ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకున్నాయి. సాగర్ నుంచి నీటి విడుదల మంగళవారానికి మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు.



స్విచ్ఛాన్ చేసి క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభిస్తున్న సీఈ నాగేశ్వరరావు

పులిచింతలకు కృష్ణమ్మ పరవళ్లు



కెఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ నుంచి విడుదల చేస్తున్న వరద పులిచింతలకు చేరుతోంది. మంగళవారం కల్లా పులిచింతలకు 2.03 లక్షల క్యూసెక్కుల వరద చేరనుంది. ఇక్కడ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌కు 26,083 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 130.15 అడుగులకు నీటి మట్టం చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 6.68 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

విత్తన వెతలు

సాగర్ నుంచి కుడికాలువకు నీటి సరఫరా మొదలైంది. పంటల సాగుపై రైతన్నల ఆశలు చిగురించాయి. అయితే విత్తన కొరత, అన్నదాతల ఆనందాన్ని ఆవిరి చేస్తోంది. రైతులు కోరుతున్న వరి విత్తనాలకు మార్కెట్‌లో కొరత ఏర్పడింది. రైతులు సాగు చేసే వరి విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడంలేదు. రైతులు ఆసక్తి చూపని బీపీటీ రకం విత్తనాలకు రాయితీ ఇస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందన్న విమర్శలున్నాయి. దీంతో బ్లాక్‌లో అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాక వరి విత్తనాల కోసం షాపుల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు. అయినా విత్తనాలు లభించక రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జేజీఎల్ 384 రకం విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

- వరి విత్తనాల కొరత
- దుకాణాల వద్ద రైతుల పడిగాపులు
- రాయితీ విత్తనం మొక్కుబడిగానే
- డిమాండ్ 32 వేల క్వింటాళ్లు
- ఉన్న రాయితీ విత్తనాలు 5 క్వింటాళ్లే
- రైతులు ఆసక్తి చూపని ఒక్క బీపీటీకే రాయితీ
- ఆందోళనలో అన్నదాతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వరి సాగుకు రైతులు సిద్ధమైన తరుణంలో విత్తన సమస్య వారిని వేధిస్తున్నది. జిల్లా వరి సాధారణ విస్తీర్ణం 1,05,237 ఎకరాలు. గత ఏడాది పత్తి సాగు ఆశాజనకంగా లేకపోవడంతో వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. దీంతో వరి సాగు 1.25 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దాదాపు 32 వేల క్వింటాళ్ల వరకు వరి విత్తనం అవసరం అవుతుంది. ప్రభుత్వం కేవలం 5వేల క్వింటాళ్ళ వరకే వరి విత్తనం కిలోకు రూ.5 చొప్పున రాయితీ ఇవ్వనున్నది. బీపీటీ 5204 రకం వరి విత్తనంకు మాత్రమే ప్రభుత్వ రాయితీ ఇస్తోంది. ఇతర రకాలకు రాయితీ ఇవ్వడం లేదు. ఈ రకం వరి సాగు చేసేందుకు రైతులు ఇష్టపడటంలేదు. బీపీటీ రకం వరి పంట కాలవ్యవధి 150 రోజులు. జేజీఎల్ 384 రకం వరి కాల వ్యవధి 135 రోజులు. తక్కువ సమయంలో పంట చేతికి రావడంతో పాటు ఈ రకం ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. దీంతో రైతులు జేజీఎల్ రకం వరి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి ప్రత్యా మ్నాయ రకాలు ఇదే కాల వ్యవధిలో పంట చేతి వచ్చేవి ఉన్నా ఇటువంటి రకాల వరి విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. జేజీఎల్ 384 రకం వరి విత్తనాలను ప్రభుత్వం రాయితీ జాబితా నుంచి తొలగించింది. తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల వ్యవసాయ విద్యాలయం పరిశోధనల ద్వారా ఉత్పత్తి చేసిన రకం వరి విత్తనాలకు జేజీఎల్ 384 అని పేరు పెట్టారు. ఈ రకం వరి కాల వ్యవధి తక్కువగా ఉండటం, మార్కెట్‌లో మంచి ధర ఉండటం వలనే రైతులు ఈ రకం వరి విత్తనాలను కోరుతున్నారు. ఈ విత్తన నిల్వలు మార్కెట్‌లో అరకొరగానే ఉన్నాయి. విత్తన కొరతతో సదరు రకం వరి విత్తనాలను బ్లాక్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తు న్నారు. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల కోసం రైతులు ఉదయం ఆరు గంటల కల్లా నరసరావుపేటలోని దుకాణాల వద్దకు వస్తున్నారు. వారు కోరుతున్న విత్తనాలు స్టాక్ లేవని వ్యాపారులు చెపుతుంటడంతో రైతులు బిక్కమొఖం వేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ రైతులు కోరుతున్న వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. ఒక వైపు వరి నారు మళ్లు పోసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్న రెతులు విత్తన కొరత వలన వరి నారు మళ్లు జాప్యం జరుగు తుందన్న ఆందోళన అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. జేజీఎల్ రకానికి ప్రత్యామ్నాయ రకాల వరి విత్తనాలు సాగు చేసే దిశగా రైతులను వ్యవసాయ శాఖ చైతన్యం తీసుకు వస్తేనే విత్తన సమస్య పరిష్కారం అవుతుందని చెప్పవచ్చు.

జేజీఎల్ 384కు ప్రత్యామ్నాయ రకాలు ఇవే

జేజీఎల్ 384 రకం వరి విత్తనాలకు ప్రత్యామ్నాయంగాఎంటీయూ 1224, ఎంటీయూ 1282, ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకాల వరి విత్తనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ మురళీ సోమవారం తెలిపారు. ఆయా రకాల కాల వ్యవధి 125 రోజులు, జేజీలు కన్నా 10 రోజులు ముందుగానే పంట చేతి వస్తుందని, దిగుబడి జేజీఎల్ 384తో సమానంగా వస్తుందని వివరించారు. ఈ రకాలు అగ్గి తెగులును తట్టుకుంటాయని చెప్పారు. ఈ రకాల వరి విత్తనాలు మార్కెట్‌లో నిల్వలు ఉన్నాయన్నారు. రైతులు జేజీఎల్‌కు ప్రత్యామ్నాయ రకాలను సాగు చేసుకోవాలని ఆయన కోరారు.



నరసరావుపేటలో వరి విత్తనాలు దుకాణం వద్ద రైతులు అందోళన

వారం నుంచి తిరుగుతున్నాం..

వారం రోజులుగా విత్తనాల కోసం దుకాణాల వెంట తిరుగుతున్నాను. తెల్లవారుజామునే విత్తనాల కోసం ఇంటి నుంచి నరసరావుపేట వచ్చి నానా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించడంలేదు. బ్లాక్‌లో విత్తనాలు అమ్ముతున్నా రు. అధికారులు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలి.



- వెంకట కోటయ్య, రైతు

రైతులు మనోవేదనకు గురవుతున్నారు..

వరి విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో విత్తనాలు రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోలేదు. అరకొరగా విత్తనాలు విక్రయిస్తున్నారు. విత్తనాల కోసం షాపుల వద్ద పడిగాపులు కాస్తూ రైతులు మనోవేదను గురవుతున్నారు. విత్తన సమస్య పరిష్కరించి పూర్తి స్థాయిలో విత్తనాలు సరఫరా చేయకుంటే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావల్సి వస్తుంది.



ఈపూరు గోపాలరావు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు..



తెల్లవారు జామునే నరసరావుపేట వచ్చాం. దుకాణం వద్ద నాలుగు గంటలు ఉన్నాం. అక్కడ స్టాక్ లేదన్నారు. స్టేషన్ రోడ్డులోని దుకాణం వద్దకు వచ్చాం. ముందుగా పేర్లు రాసుకున్నారు. విత్తనాలు ఇవ్వకుండా షాపు మూసివేసి వెళ్లిపోయారు. స్టాక్ లేదంటున్నారు. విత్తనాలను వ్యాపారులు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. **హనుమంతరావు, రైతు ఆరేపల్లి ముప్పాళ్ల**

పల్నాడు జిల్లా జెసీగా ధనుంజయ్



నరసరావుపేట, ఆగస్టు 5 : పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా గనోర్ సూరజ్ ధనుంజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్, రామచంద్రాపురం గిరిజన సంక్షేమ ప్రాజెక్టు అధికారిగా పని చేస్తూ ధనుంజయ్ ఇక్కడకి బదిలీ అయ్యారు. ధనుంజయ్ 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అయన జిల్లా రెండో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జాయింట్ కలెక్టర్‌గా పని చేసూ శ్యాంప్రసాద్ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా గత నెల 2న బదిలీ అయ్యారు. సూరజ్‌ను వివిధ శాఖ అధి కారులు కలసి బోకేలు అందజేసి అభినందలు తెలిపారు.

మేం వెళ్లిపోతాం..

- సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎంపీడీఓల ఎదురుచూపులు
- ఇక్కడి విధులకు మొక్కుబడిగా హాజరు

7లో..

అమ్యామ్యాల అంగన్వాడీ

- పాలప్యాకెట్లకు రెక్కలు.. కోడిగుడ్లకు కాళ్ళు
- మెడికల్ లీవులకు ముడుపులు ఇవ్వాల్సిందే
- సూపర్‌వైజర్ల కనుసన్నల్లో సీడీపీఓలు

దిక్సూచి
DIKSUCHI

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్థ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు



4455 ఖాళీలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21. వెబ్‌సైట్: https://ibps.in/

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువ పత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/WP5N39qలో
చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పతాక సన్నివేశాల చిత్రీకరణ



అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

అద్భుతమైన విజువల్స్‌తో 'చుట్టమల్లే'




జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లె' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్' లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలియకలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.

ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసరం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో ఆయా ఛానళ్లు క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.

సినిమా చెట్టు నేలకు ఒరిగింది





గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసేవారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.

ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్లుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర

ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్టు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది. ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుపానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్థులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి..
- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. '2019లో విశాఖ ఎయిర్ పోర్టులో నాపై కోడికత్తితో దాడి జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి కాకముందే నాకు ఉన్నత స్థాయి భద్రత కల్పించారు. నేను సీఎం అయ్యాక జడ్ ప్లస్ కేటగిరీ కింద 139 మందితో రక్షణ కల్పించారు. 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించి నెల గడవకముందే నాకున్న భద్రతా సిబ్బంది సంఖ్యను 59కి తగ్గించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రక్షణ తగ్గించడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రచారంలో నాపై రాయితో దాడి చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

మూఢాలు పోయాయి... పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి

- రేపటి నుంచి 28 వరకూ...
- 11, 18 తేదీల్లోనే అత్యధిక పెళ్లిళ్లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురుచూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. 'శుభ శ్రావణ మాసం.. శుభస్య శీఘ్రం' అంటూ పంతులు గారు మంచి రోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడు నెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్ర మాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారులకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడైతే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10 రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18 తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్దశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి.

ఉపాధి కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ

నకరికల్లు, ఆగస్టు 5: నిరుద్యోగ యువతీ యువకులకు రిఫ్రిజరేషన్ ఎయిర్ కండిషన్ సర్వీస్ కోర్సులో యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ తెలిపారు. అలాగే కంప్యూటర్ ట్యాలీ, అకౌంటింగ్ కోర్సులోను ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆయన వివరించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు పది పాస్ లేదా ఫెయిల్ అయినవారు 19 నుంచి 45 సంవత్సరాలు వయసు ఉన్నవారు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు తెల్లరేషన్‌కార్డు కాపీ, ఆధార్‌కార్డ్ జిరాక్స్, నాలుగు పాస్‌ఫోర్టు సైజు ఫోటోలు, 10వ తరగతి పాసు లేదా ఫెయిల్ సర్టిఫికెట్ జిరాక్స్‌తో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, డోర్ నం.14-1-14, ఓల్డ్‌బ్యాంకు స్ట్రీట్, కొత్తపేట, గుంటూరులో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 97006 87696, 81253 97953, 99499 30155 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలు

తెనాలి అర్బన్, ఆగస్టు 5: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్.చినవెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 26 లోగా అభ్యర్థులు దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా కానీ, నమోదు కేంద్రంలోగాని నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రైవేట్ ఐటీఐలో 570 ఖాళీలు ఉన్నాయని, 29న కౌన్సెలింగ్‌కు ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తెనాలి ఐటీఐలో సంప్రదించాలని చెప్పారు. ప్రైవేట్ ఐటీఐలో కౌన్సెలింగ్ కోసం ఈ నెల 31న హాజరు కావాలన్నారు. ఏ ఐటీఐలో చేరదలుచుకున్నారో ఆ ఐటీఐకి మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు.

అమ్యామ్యాల అంగన్వాడీ

- పాలప్యాకెట్లకు రెక్కలు.. కోడిగుడ్లకు కాళ్ళు
- మెడికల్ లీవులకు ముడుపులు ఇవ్వాల్సిందే
- సూపర్‌వైజర్ల కనుసన్నల్లో సీడీపీఓలు



గుంటూరు సిటీ, ఆగస్టు 5: గుంటూరు జిల్లాలోని అంగన్వాడీల్లో అవినీతి రాజ్యమేలుతోంది. అడిగేవారు లేరన్న ధీమాతో కొందరు సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రోజు రోజుకు వారి ఆగడాలు పెచ్చుమీరటంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు విచారణ కు ఆదేశించారు. జిల్లా అధికారులు చేపట్టిన చర్యలు తూతూ మంత్రమేనని బాధితులు చెబుతున్నారు. కొందరు సూపర్‌వైజర్లకు సెక్టార్లు మార్చినా లోతైన విచారణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా ఈ మొత్తం వ్యవహారంలో సీడీపీఓల పాత్ర కీలకం అని చెబుతున్నారు. జిల్లాలోని ఆరు ప్రాజెక్టులు, 55 సెక్టార్లలో అవినీతి వ్యవస్థీకృతం అయ్యిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకూ పలు ప్రభుత్వ శాఖలో చోటుచేసుకున్న అక్రమాలు కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పోషకలోపంతో అల్లాడుతున్న తల్లీపిల్లల పోషకాహారాన్ని సైతం కైంకర్యం చేస్తున్న అక్రమార్కుల గుట్టు రట్టవుతోంది. అంగన్వాడీ కేంద్రాలను గాడిలో పెట్టాల్సిన అధికారులే మామూళ్ల రుచిమరిగి అవకతవకలను ప్రోత్సహిస్తున్న ఘటనలు తాజా విచారణలో బయట పడుతున్నాయి. అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తీగలాగితే కదిలిన డొంక

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారులు వ్యవస్థలను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో క్షేత్రస్థాయిలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. లబ్ధిదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో బాధితులు ఫిర్యాదులు చేయడం కూడా అనవసరమనే పరిస్థితి ఏర్పడింది. దీంతో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ అందరూ ఒక్కటై అంగన్వాడీలను దోపిడీ చేసేపనిలో పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాకతో అధికారులకు అక్రమాలపై ఫిర్యాదులు అందాయి. దానిపై జిల్లాస్థాయి అధికారులు చూసీచూడనట్లు వదిలేసినా, పైస్థాయి అధికారులు విచారణ జరిపించారు. విచారణలో విస్తుగొలిపే అంశాలు బయటపడ్డాయి. కేవలం ఒక అంశంపై విచారణ చేపట్టిన అధికారులు తీగ లాగితే డొంకంతా కదిలింది. అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన విచారణ ఐసీడీఎస్ సీడీపీవో స్థాయి అధికారుల వరకూ చేరింది. దీంతో అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు.

పాల ప్యాకెట్లు దారి మళ్లింపు

గుంటూరు నగరంలో ఒక అంగన్వాడీ సూపర్‌వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన పాల ప్యాకెట్లను దారి మళ్లించి, రూ.80వేలు సొమ్ము చేసుకున్నారు. అయితే అవి అంగన్వాడీ కేంద్రాలకు అందినట్లు కార్యకర్తల నుంచి సంతకాలు తీసుకున్నారు. పాల ప్యాకెట్లు రాలేదని అడిగితే ప్రభుత్వం పంపలేదని బుకాయించి తప్పించుకోజూశారు. దీనిపై లబ్దిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. జోనల్ అధికారుల జోక్యంతో విచారణ చేపట్టారు. ఆ విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయి. విచారణ అధికారుల ముందు కార్యకర్తలు అనేక అంశాలను బయటపెట్టారు.

కోడిగుడ్లదీ అదే పరిస్థితి..

కొన్ని కేంద్రాలకు కోడిగుడ్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు యాప్‌లో సమాచారం నమోదుచేసినట్లు తెలుస్తోంది. వివిధ కారణాలతో గర్భిణీ, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారంలో కోతలు పెడుతున్నారు. మిగిలిన వాటిని పక్కకు తప్పిస్తున్నారు. ఇందులో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం అని తెలుస్తోంది. లబ్ధిదారుల ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) ఆధారంగా పోషణ ఇస్తున్నప్పటికీ అక్రమాలకుదారులు వెతికారు.

మెడికల్ లీవ్ కావాలంటే కాసులివ్వాల్సిందే!

అంగన్వాడీ ఉద్యోగులకు మెడికల్ లీవ్ ఇవ్వాలంటే వారు కాసులు ఇవ్వాల్సిందే. ఒక్కో అధికారి సెలవులు మంజూరు చేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చాలామంది ఇలా లంచాలు సమర్పించుకున్నారు.

నెలవారీ వసూళ్లు

మరో అంగన్వాడీ సూపర్‌వైజర్ అంగన్వాడీ కార్యకర్త ఇంట్లోనే మకాం పెట్టారు. ఆ కార్యకర్త ద్వారా ఆమె వసూళ్ల పర్వం మొదలు పెట్టారు. డబ్బులు ఇవ్వడానికి నిరాకరించినవారితో తనిఖీల పేరుతో భయపెట్టి మరీ దండుకుని ఇద్దరూ పంచుకుంటున్నారు.

యూనిఫామ్ వంకతో వసూళ్లు

అంగన్వాడీ సిబ్బంది విధులకు హాజరైనప్పుడు యూనిఫామ్ ధరించాలి. అలా యూనిఫామ్ వేసుకోకుండా చీరలతో వచ్చి విధులకు హాజరైతే వాటి విషయంలో కూడా సూపర్‌వైజర్‌లు వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొందరు అంగన్వాడీ సిబ్బంది పొరపాటున ఏవైనా తప్పులు చేస్తే వాటిని రికార్డుల్లో రాయకుండా వుండేందుకు డబ్బులు దండుకుంటున్నారు. ఇలా అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, వారిని ఆపై వుండే సీడీపీవోలు దోపిడీ చేస్తున్నట్లు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మొత్తం జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై అధికారులు ఆరా తీస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మేం వెళ్లిపోతాం..

- సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎంపీడీఓల ఎదురుచూపులు
- ఇక్కడి విధులకు మొక్కుబడిగా హాజరు

గుంటూరు సిటీ, ఆగస్టు 5: 'ఏమండీ ఇవన్నీ మాకెందుకండీ.. రేపో.. మాపో వెళ్లిపోతాం.. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి' అంటూ జిల్లాలోని కొందరు ఎంపీడీఓలు (మండల అభివృద్ధి అధికారులు) బేలగా మాట్లాడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇక్కడకు వచ్చిన ఎంపీడీఓలు విధి నిర్వహణలో చాలా అనాసక్తత ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో వివిధ జిల్లాల నుండి ఉమ్మడి జిల్లాకు వచ్చిన ఎంపీడీఓలు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాకు 35మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాల నుండి వచ్చారు. కడప నుండి ఒకరు, కృష్ణా జిల్లా నుండి 12 మంది, ప్రకాశం జిల్లా నుండి 22 మంది ఎంపీడీఓలు ఎన్నికల విధుల నిమిత్తం వచ్చారు. ఉమ్మడి జిల్లా నుండి కూడా అంతే మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. వాస్తవానికి ఎన్నికలు ముగిసిన తర్వాత వారికి సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలి. ఇతర జిల్లాల నుండి వచ్చిన తహసీల్దార్‌లను అదే రీతిలో సొంత జిల్లాలకు పంపి పోస్టింగ్‌లు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఎంపీడీఓలను మాత్రం ఇక్కడే ఉంచటంతో కీలకమైన మండల అభివృద్ధి విషయాల్లో ప్రభావవంతమైన నిర్ణయాలు జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సమయంలో పక్క జిల్లాల నుండి వచ్చిన ఎంపీడీఓలు మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను సరిగా పట్టించుకోవటం లేదని తెలుస్తోంది. కార్యాలయానికి రావటం.. పోవడం తప్ప పెద్దగా విధులు నిర్వహించటం లేదని అంటున్నారు. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాల్లో ఈఓపీఆర్డీలు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

మారిస్తేనే మంచిది....

ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. జిల్లా పరిషత్‌లో ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటుచేసి పారిశుధ్యంపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నా కొందరు పంచాయతీ సెక్రటరీలకు చీమ కుట్టినట్లు కూడా ఉండటం లేదు. గ్రామస్థాయి నేతలు సదరు విషయాలను ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్తున్నారు. నేతలు చెబుతున్న విషయాలను ఎంపీడీఓలు పెద్దగా సీరియస్‌గా తీసుకోవటం లేదు. వెళ్లిపోతాం అన్న ఆలోచనతో పనులపై పెద్దగా ఆసక్తి చూపటం లేదు. మండల స్థాయి నేతలు కూడా త్వరగా ఇతర జిల్లాల ఎంపీడీఓలను వెనక్కు పంపిస్తేనే బాగుంటుందని అంటున్నారు. ఈ జిల్లా వాళ్ళకు ఇక్కడ విధులు కేటాయిస్తే మండల అభివృద్ధిపై బాధ్యతగా విధులు నిర్వహిస్తారని అంటున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకుంటుందని అందరూ భావిస్తున్నారు.

11 క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ

- పులిచింతలకు 1,32,000 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, ఆగస్టు 5: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 1,32,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు సోమవారం ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. తొలుత పూజలు నిర్వహించి 11 క్రస్ట్‌గేట్లను ఎత్తినట్లు పేర్కొన్నారు. ఎగువన వున్న నాగార్జునసాగర్ నుంచి 1,32,000 క్యూసెక్కులు నీరొస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకున్న 20 క్రస్ట్ గేట్లకు గాను 11 గేట్లను ఎత్తామని అందులో 6 గేట్లు 2.5 మీటర్లు, 5 గేట్లు 2 మీటర్లమేర ఎత్తి 1,24,000, రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.01 మీటర్ల నీరుండగా ఆ నీరు 6.87 టీఎంసీలకు సమానమన్నారు.పూర్తిస్థాయి నీటిమట్టం 7.080 టీఎంసీలు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. నదిలో చేపల వేటకు వెళ్లొద్దని మైక్ ద్వారా హెచ్చరిక జారీ చేశామన్నారు.

పెండింగ్ ఎల్పీఎస్ పూర్తిచేయాలి

- సీఆర్డీఏ అధికారులకు అడిషనల్ కమిషనర్ ఆదేశం



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన అడిషనల్ కమిషనర్ సూర్య సాయిప్రవీణ్

తుళ్లూరు, ఆగస్టు 5: సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లతో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్య సాయిప్రవీణ్ తుళ్లూరు కార్యాలయంలో సోమవారం సమావేశం అయ్యారు. ఎల్పీఎస్(ల్యాండు పూలింగ్ స్కీ) కింద ఎంత భూమి రావాల్సివుందో గుర్తించి వారితో మాట్లాడి పూర్తిచేయాలని సూచించారు. కానీ గ్రామాలలో ఒక ఎకరం, రెండు ఎకరాలు చిన్న చిన్న సమస్యల కారణంగా ల్యాండు పూలింగ్ కింద రాలేదు. ఇప్పుడు దానిని పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటికే రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు వేగవంతం అయ్యాయని, ఇంకా స్పీడ్ పెంచాలని ఆదేశించారు. జంగిల్ క్లియరెన్స్ పూర్తయ్యేనాటికి ల్యాండు పూలింగ్, రిజిస్ట్రేషన్‌లు పూర్తైతే రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకాలుండవని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని సమావేశంలో చర్చించారు. అనంతరం రైతులు తమ సమస్యలపై అర్జీలను అడిషనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెప్షల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, వివిధ యూనిట్‌ల డీసీలు, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీడియోలు, ఫొటోలు తీయవద్దు...

తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం జరుగుతుండగా విలేకరులు ఫొటోలు, వీడియోలు తీయబోతుంటే అదనపు కమిషనర్ సాయి సూర్య అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశం గురించి మాట్లాడమని కోరినా.. అందుకు తిరస్కరించటం విశేషం. మీడియాతో ఏమీ మాట్లాడవద్దని కమిషనర్ కాటంనేని భాస్కర్ నుండి ఆదేశాలుండటంతో ఆయన ఈవిధంగా స్పందించినట్టు తెలిసింది. రాజధాని గ్రామాలలో, సీఆర్డీఏలో జరుగుతున్న కార్యక్రమాల గురించి మీడియాకు చెప్పకపోవటంతో సమాచారం ప్రజలకు తెలియటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రైలు కింద పడి యువకుడు మృతి



పెదకోట్ల బాలస్వామి(ఫైల్)

ఫిరంగిపురం, ఆగస్టు 5: ఫిరంగిపురంలోని రసూల్ పేటకు చెందిన పెదకోట్ల బాలస్వామి (33) ఈనెల 3వ తేదీ రాత్రి సుమారు 10:30 గంటలకు రైలు కిందపడి మృతిచెందగా సోమవారం మృతునికి ఫిరంగిపురంలో అంత్యక్రియలు చేశారు. మృతుని బంధువుల కథనం మేరకు మృతుడు పెద కోట్ల బాలస్వామి 3వ తేదీ రాత్రి 10:30 గంటలకు మానసికంగా బాగా లేక ఆరోగ్యనగర్‌కు వెళ్ళే రైల్వే అండర్ బ్రిడ్జికి దగ్గరలో శనివారం రాత్రి రైల్వేపట్టాలపై పడిపోగా గుంటూరు నుంచి వెళ్ళే అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు బాలస్వామి పైనుంచి వెళ్ళగా తల, మొండెం వేరయ్యాయి. నరసరావుపేట రైల్వే పోలీసులు మృతదేహాన్ని తీసుకువెళ్ళి పోస్టుమార్టం చేసి మృతుడి స్వగ్రామమైన ఫిరంగిపురం తీసుకువచ్చి అప్పగించారు. మృతునికి భార్య గోవర్ధని, కుమారులు మేరీ జోసెఫ్ తేజ, ప్రేమ్ కుమార్‌లు ఉన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ...

తాడికొండ, ఆగస్టు 5: గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన తాడికొండ మండలం లాంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడికొండ మండలం పాములపాడు గ్రామానికి చెందిన కార్యంశెట్టి స్వామ్రాజ్యం(55) కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతోంది. గుంటూరు హస్పటల్‌లో వైద్యం చేయించుకోవటానికి కుమారుడు సాంబశివరావు, కోడలు స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై గుంటూరు బయలుదేరారు. లాం చలపతి కళాశాల దాటిన తరువాత వెనుక నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు ఢీ కొట్టడంతో స్వామ్రాజ్యం తలకు బలమైన గాయమైంది. కుమారుడు, కోడలికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆటోలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్వామ్రాజ్యంను చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ స్వామ్రాజ్యం మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాంబశివరావు ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

ముప్పాళ్ళ, ఆగస్టు 5: తండ్రి హాస్టల్‌లో ఉండి చదువుకోమని మందలించటంతో విద్యార్థి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదలలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యు ల కథనం మేరకు మాదల గ్రామానికి చెందిన సుంకర చంద్రశేఖ ర్(22) నరసరావుపేటలోని ఒక కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవ త్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెళ్ళకుండా తిరుగుతుండటం తో తండ్రి శ్రీను మందలించాడు. దీంతో చంద్రశేఖర్ ఆదివారం పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం చంద్రశేఖర్ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా మృతి చెందటంతో తల్లి బోరున విలపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హజరత్తయ్య తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని...

మాచర్లటౌన్, ఆగస్టు 5: ఉరివేసుకొని ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన జక్కి రేణుక యల్లమ్మ (22) మాచర్ల మండల పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మాచర్ల పట్టణంలోని కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో హాస్టల్‌లోని స్టడీరూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం గమనించిన తోటి విద్యార్థినులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రేణుక యల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తండ్రి గౌరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మయ్య తెలిపారు. విద్యార్థిని రేణుక యల్లమ్మ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఉచిత బియ్యాన్ని డీలర్లతో పంపిణీ చేయించాలి

- కేంద్ర మంత్రి పెమ్మసానికి రేషన్ డీలర్ల విజ్ఞప్తి



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కలిసి సమస్యలను వివరించిన రేషన్ డీలర్లు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తోన్న రేషన్ బియ్యాన్ని డీలర్ల ద్వారా పంపిణీ చేయించాలని ఆంధ్రప్రదేశ్ చౌకధరల దుకాణాదారుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి విజ్ఞప్తి చేశారు. సోమవారం గుంటూరులో అసోసియేషన్ నాయకులు కేంద్ర మంత్రిని కలిసి సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ పౌరసరఫరాల చట్టం ప్రకారం రేషన్ డీలర్ల వ్యవస్థ ఏర్పాటైందని, దీని దృష్ట్యా ఎండీయూ, సివిల్ సప్లయిస్ కంట్రోలింగ్ ఆర్డర్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు, చీఫ్ అడ్వయిజర్ దాసరి శ్రీనివాసరావు, నగర నాయకులు వీ అంజయ్య, నిర్మల, రవి చంద్రమోహన్, రషీద్ పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ.12 లక్షల విరాళం



దాతలను సత్కరిస్తున్న కమ్మ జన సేవా సమితి పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5: జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో రెండు గదుల నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని రూ.12లక్షల చెక్కును విశ్రాంత హిందీ ఉపాధ్యాయురాలు వేములపల్లి రాణీ ప్రమీల, విశ్రాంత విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీరు ఎం.మల్లికార్జునరావు దంపతులు సోమవారం స్థానిక పట్టాభిపురంలోని వారి నివాసంలో పాలకవర్గ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకత, విద్యార్థినులకు రక్షణ, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్న కమ్మజన సేవా సమితి సేవలు అభినందనీయమని అన్నారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేద కుటుంబంలో పుట్టిన వారు ఇంత పెద్ద విరాళం అందజేయడం అభినందనీయమని అన్నారు. దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. అనంతరం దాతలను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



గోపీకృష్ణ, వేణు (ఫైల్ ఫొటోలు)

మంగళగిరి సిటీ, ఆగస్టు 5: మంగళగిరి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మంగళగిరి పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన గోలి వేణు (23), లింగంపల్లి గోపీకృష్ణ (25) వరుసకు బావ, బావమరుదులు అవుతారు. గోపీకృష్ణ స్వర్ణకార వృత్తి నేర్చుకునే నిమిత్తం సుమారు ఇరవై రోజుల నుంచి మంగళగిరిలోని బంధువుల వద్ద వుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో గోపీకృష్ణను కలిసేందుకు వేణు తోటవారిపాలెం నుంచి వచ్చాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం చిన కాకాని నుంచి మంగళగిరి పట్టణంలోకి వస్తున్నారు. ఎర్రచెరువు కాళీమాత ఆలయం ఎదురుగా వున్న మలుపు వద్దకు రాగానే రోడ్డుపై ఆవులు అడ్డుపడ్డాయి. వాటిని తప్పించబోయి బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో వేణు, గోపీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేణు తండ్రి గోలి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

27,626 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 30,579 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 27,626 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 19,051 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	9500	13500
నెంబరు. 5	9000	13000	నెంబరు.5	--	--
273	9500	12500	273	--	--
341	8500	15000	341	11000	3500
4884	--	--	4884	12500	12500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	8000	18300
బ్యాడిగి	8500	15500	బ్యాడిగి	9000	14000
దేవనూరుడీలక్స్	9000	13000	దేవనూరుడీలక్స్	--	--
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	6000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సుపరిపాలన అందిస్తాం

- కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు
- సహించలేకనే మాజీ సీఎం జగన్ నిరాధార ఆరోపణలు
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల, ఆగస్టు 5 : నియోజకవర్గ అభివృద్ధితో స్థానికంగా ముడిపడివున్న వివిధ వ్యవస్థలను గాడిలో పెట్టి సుపరిపాలన అందజేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రెంటచింతలలో విలేకరుతో మాట్లాడుతూ.. జగన్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన ప్రజలు ఇప్పుడు, ఆ 11 సీట్లైనా ఎందుకిచ్చామని బాధపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రెండు నెలల పాలనతోనే ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందిందన్నారు. దీనిని జీర్ణించుకోలేకనే మాజీ సీఎం జగన్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. నియోజకవర్గంలో వైసీపీ హయాంలో జరిగిన భూ దందా, అవినీతిపై సమగ్ర విచారణ చేయిస్తామని, ఆయా వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి వెంట కూటమి నేతలు ఉన్నారు.

విద్య ద్వారానే పేదల అభ్యున్నతి

మాచర్లటౌన్, ఆగస్టు5: విద్య ద్వారానే పేద వర్గాల అభ్యున్నతి సాధ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో కార్ఫ్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన బాలబాట ఆర్గనైజర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ.. బాలబాట ద్వారా పేద వర్గాల విద్యాభివృద్ధికి కార్ఫ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం 1200 కుటుంబాలకు 10 రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుక్కమూడి ప్రసాద్, యేసుపొంగు చంద్రరావు, కార్ఫ్ సంస్థ డిప్యూటి డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్, బాలబాట ఏసీవో పేరుపోగు ప్రసాద్, వినుకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కారంపూడి, ఆగస్టు 5: కారంపూడి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సెబ్ అధికారులు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సోమవారం హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, సెబ్ ఎస్ఐ సూర్యనారాయణ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి బెల్లం ఊటను ధ్వంసం చేసి, ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి నిందిదులైన వల్లెపు కొండయ్య, బానావత్ రామాంజినాయక్‌లను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

నిత్యావసరాలను సక్రమంగా అందించాలి

దాచేపల్లి, ఆగస్టు 5: పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని దాచేపల్లి తహసీల్దార్ కుటుంబరావు రేషన్ డీలర్లను ఆదేశించారు. సోమవారం దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్‌షాపులో బియ్యం పంపిణీ చేశారు. త్వరలోనే రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ బత్తుల లక్ష్మీ పెదవెంకయ్య, బత్తుల నాగేశ్వరరావు, శంకరశెట్టి సుబ్బారావు, జానకిరామయ్య, జనసేన నాయకులు అంబటి మల్లి, మిరియాల నరసింహారావు, చాపా సాంబశివరావు, సుంకర శ్రీను, రోళ్ల పెదశేషయ్య, మంచి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో ఆరోగ్యకర నారు మడి

క్రోసూరు, ఆగస్టు 5: ఆరోగ్యవంతమైన నారును పెంచటానికి యాజమాన్య పద్ధతు పాటించాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ అన్నారు. పలు గ్రామాల పరిధిలో నారు మళ్ళను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరం విస్తీర్ణంలో వరి నారు నాటడానికి ఐదు సెంట్ల విస్తీర్ణంలో 20 నుంచి 25 కిలోల విత్తనాలు అవసరమవుతాయన్నారు. వరి నారు మడి వేసే భూమిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలతో మూడు సార్లుగా దమ్ము చేసుకోవాలని, నారు మడిలో నీరు పెట్టడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఐదు సెంట్ల నారు మడికి విత్తనం చల్లేముందు, చల్లిన తర్వాత రెండు వారాలకు ఒక కిలో చొప్పున నత్రజని వేసుకోవాలని, ఒక కిలో భాస్వరం ఎరువులో కలిపి దుక్కిలో వేయాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున వాడాలన్నారు. ఆకు పూర్తిగా పురి విచ్చుకొనే వరకు ఆరు తడులు ఇచ్చిన తర్వాత పలుచగా నీరు పెట్టాలన్నారు. జింకు,ఇనుప దాతులోపాన్ని గమనిస్తే జింకు సల్ఫేట్, ఫెర్రస్‌సల్ఫేట్ వాడుకోవాలన్నారు. గడ్డి జాతిని నిర్మూలించేందుకు, కలుపు మొక్కల నిర్మూలనకు తగు పురుగు మందులను వాడాలన్నారు. ఆయనతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది గోపీ, టీ సందీప్‌లు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల

రెంటచింతల,ఆగస్టు 5 :ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసినట్లు ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో మొత్తం 38 పాఠశాలల్లో 2010 మంది దాకా ఓటర్లున్నారని, ఈనెల 8న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

తక్షణమే ఖాళీ చేయండి

- ముంపు గ్రామాల ప్రజలకు అధికారుల ఆదేశాలు

మాచవరం, ఆగస్టు 5: నాగార్జున సాగర్ నుంచి నీటి ప్రవాహం ఉధృతంగా ఉడటంతో కృష్ణానది పరివాహక గ్రామమైన వెల్లంపల్లి గ్రామస్థులు తక్షణమే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా ఎస్ఐ అమీనుద్దీన్, రెవెన్యూశాఖ అధికారులు ఆదేశించారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామం పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల పూర్తిగా ముంపు జాబితాలోకి ఉండగా తీసుకొని ఆ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయిం చారు. అయితే సుమారు ఐదారు కుటుంబాల వారు అక్కడే ఉంటున్నారు. వారు ఎట్టి పరిస్థితుల్లో ఖాళీచేసి వెళ్లాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో నాంచారయ్య, పోలీసు సిబ్బంది హెచ్చరించారు.

ఈ పంట నమోదు

పెదకూరపాడు, ఆగస్టు 5 : ఖరీఫ్ 2024 సంవత్సరానికి సంబంధించి పంట వేసిన రైతులకు, కౌలు రైతులకు ఈ పంట నమోదు కార్యక్రమం చేపడుతున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఇంజం శాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని రైతుల సేవా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఈ పంట నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

సాగునీటి కాల్వల నిర్వహణ అధ్వానం



తంగెడ మేజర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

- రైతులను నట్టేట ముంచిన వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లలో పూడిక తొలగించిన జాడే లేదు
- దిగువ భూములకు సాగునీరు అందేలా చూస్తా
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 5: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి కాల్వలు నేడు అధ్వానంగా ఉన్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వీరాపురం సమీపంలోని తంగెడ మేజర్‌ను రైతులతో కలిసి యరపతినేని శ్రీనివాసరావు పరిశీలించారు. కాల్వల్లో పూడికతీత, జమ్ము, నాచు తొలగించక పోవడంతో దిగువ భూముల రైతులకు సాగునీరు అందటం కష్టంగా వుందని పిడుగురాళ్ల, దాచేపల్లి మండల గ్రామాల్లోని రైతులు ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. అధ్వానంగా వున్న తంగెడ మేజర్‌ను యరపతినేని పరిశీలించి, కాలువ మరమ్మతు పనులు చేయించి దిగువ భూములకు సాగునీరు అందేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైరస్ సోకి దెబ్బతిన్న పత్తి మొక్కలను పరిశీలించి రైతులకు పరిహారం అందించే విషయంలో వ్యవసాయ అధికారులతో చర్చించారు. వర్షాకాలంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంట పొలాల్లో నీరు నిల్వ వుండకుండా తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు అవసరమైన మందును పిచికారి చేయడం ద్వారా పంట నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చన్నారు.కార్యక్రమాలలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్లు గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, పర్వతనేని రామారావు, మామిడి చంద్రశేఖరరావు, షైనేని వేణు, మేకల రాంబాబు, యడ్లపల్లి శివ, సూర్యదేవర ఆదినారాయణ, మోపర్తి ప్రకాష్, కడియాల సదాతో పాటు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల కిట్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

చిన్నారులకు ప్రీస్కూల్ కిట్లు అందజేత ..

లెనిన్‌నగర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ప్రభుత్వం అందజేసిన ప్రీస్కూల్ కిట్లను చిన్నారులకు అందజేశారు కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో రుక్సానా బేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో పాటు పాండురంగ శ్రీను, ఎల్‌వీఆర్, చిలకా చిన్న, బత్తుల శ్రీను, జనసేన నాయకులు కామిశెట్టి రమేష్, సయ్యద్ ఖాశిం సైదా, ఆత్మకూరి కాశీ, మస్తాన్‌వలి, కార్ సైదా పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవస్థాన నిర్మాణ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే

గురజాలటౌన్ : గురజాల పట్టణ శివారులోవున్న వాగ్దేవీ ఫార్మసీ కళాశాల పక్కన నిర్మించనున్న అయ్యప్పస్వామి దేవస్థానం కోసం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



గురజాల పట్టణ శివారులో అయ్యప్పస్వామి దేవస్థాన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లోని ప్రభుత్వ సమాచారం తొలగింపు

రెంటచింతల, ఆగస్టు 5: వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం వలంటీర్ల వాట్సాప్ గ్రూప్‌లో నిక్షిప్తమై వుందని ఆ సమాచారాన్ని వెంటనే తొలగించాల్సిందిగా కలెక్టర్ అరుణబాబు సోమవారం ఆదేశాలు జారీచేశారని ఎంపీడీవో శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా సంబంధిత సమాచారన్ని తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

సర్పంచ్ పసుపులేటి బాధ్యతల స్వీకరణ

రాజుపాలెం, ఆగస్టు 5: మండలంలోని బీరవల్లిపాయ గ్రామ సర్పంచ్‌గా పసుపులేటి వెంకటస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా ఉన్న సాంబశివరావు సెలవుపై వెళ్లటంతో పసుపులేటి వెంకటస్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, మొక్కపాడు సర్పంచ్ కణదం పద్మ శ్రీను, మాజీ సర్పంచ్‌లు పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరావు, వాసా వెంకటేశ్వర్లు, చిమట సైదయ్య, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు, సాని కొమ్ము కోటిరెడ్డి, లేబాకుల బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి మహాకాళమ్మ తదితరులు వెంకటస్వామిని శాలువతో సత్కరించారు.

వీఆర్ఏల నిరసన

అమరావతి, ఆగస్టు 5: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గ్రావ రెవెన్యూ సహాయకులు నిరసన వ్యక్తంచేశారు. పల్నాడుజిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సూరిబాబు, రాజు, ఖాజావలీ, రజియా, సువర్ణ, దినేష్, జాన్‌సైదా పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టరు

అమరావతి, ఆగస్టు 5: మండల పరిధిలోని మునగోడు గ్రామంలో సోమవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరును ఎస్ఐ నర్సింహులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ క్వారియింగ్, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టరు డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

సీఐకి టీడీపీ నేతల సత్కారం

క్రోసూరు, ఆగస్టు 5 : పెదకూరపాడు సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రత్తిపాటి సురేష్‌ను సోమవారం పలువురు టీడీపీ నేతలు క్రోసూరు పోలీసు స్టేషన్‌లో కలుసుకొని ఘనంగా సత్కరించారు. గతంలో క్రోసూరు ఎస్ఐగా పనిచేసిన పత్తిపాటి సురేష్ ఇక్కడ నేతలకు పరిచితులు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీఐకి టీడీపీ నేతలు సూచించారు. తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి, నేతలు కొండవీటి శ్రీనివాసరావు, గంజిమాల నాగేశ్వరరావు, చిలకా ఏసు, చిలకా రమేష్ తదితరులు సీఐ సురేష్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు

గురజాలటౌన్, ఆగస్టు 5: గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణకు సంబంధించి ఇరు వర్గాల వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని, ఎవరైనా గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడి శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

జీవో 117ను రద్దు చేయాలి

మాచర్లటౌన్, ఆగస్టు 5: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలని ఎస్టీయూ ఏరియా కార్యదర్శి తాటి రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటి, ఐఆర్ ప్రకటించాలని కోరారు కర్యక్రమంలో జిల్లా మైనార్టీ కన్వీనర్ అబ్దుల్ జబ్బార్, మాచర్ల అధ్యక్షుడు ఎక్స్‌మాస్ జాన్, జిల్లా కౌన్సిలర్లు కృష్ణనాయక్, మధుసూదనరావు, సుభాని సిలార్ పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

నకరికల్లు, ఆగస్టు 5: మండలంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మార్కెట్‌లో మరో 900 క్వింటాళ్ళ వరకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ అధికారి కే దేవదాసు తెలిపారు. సాగర్ నీరు విడుదల కావటంతో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారని, కేఎన్ఎం 1638 రకం, కేఎన్ఎం 733 రకం, ఎంటీయూ 1224 రకం, ఎంటీయూ 1282 రకం, ఆర్ఎన్ఆర్ 15048 రకం సాగు చేసుకోవాలని ఏవో సూచించారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, లాట్ నెంబర్లను పరిశీలించు కోవాలని రైతులకు ఏవో సూచించారు.

తహసీల్దారుకి సత్కారం

అచ్చంపేట, ఆగస్టు 5 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ జీ.శ్రీనివాస్‌ను, సీఐ వెంకటప్రసాదును టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నల్లమేకల వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మొక్కపాటి గిరిబాబు, చెరుకుంపాలెం సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావు, శివరాత్రి పెద శ్రీను, చల్లా అనూపకళ, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

శ్రావణ మాస సందడి

సత్తెనపల్లి, ఆగస్టు 5: శుభ ప్రదమైన శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభమైంది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం వ్రతాన్ని ఆచరించి పరమ శివుని భక్తులు ఉపవాసాలు ఉన్నారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో నిత్యం వ్రతాలు, పూజలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలకు, గౌరీ వ్రతాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో ఆలయాలు భక్తులతో కళ కళ లాడనున్నాయి.

తహసీల్దారుకి అభినందనలు

అమరావతి, ఆగస్టు 5: మండల తహసీల్దార్, ఏపీ ఆర్ఎస్ఏ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగమల్లేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, పల్నాడుజిల్లా రెవెన్యూ అధికారుల సంఘ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ వీఆర్వో అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.రామారావు, మండల వీఆర్వోలు, ఏపీ వీఆర్వో అసోసియేషన్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ, ఉప ప్రధాన కార్యదర్శి కేపీ.చారీ పాల్గొని జిల్లాలో వీఆర్వో సంఘాన్ని బలోపేతం చేయుటకు సహకరించాలని తహసీల్దార్‌ను కోరారు.

ద్విచక్ర వాహనం దహనం

క్రోసూరు, ఆగస్టు 5 : క్రోసూరు పంచాయతీ శివారు గ్రామం ఎర్రబాలెంలో ఆదివారం అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని గుమ్మడి ఏసుబాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో వైసీపీ సానుభూతి పరుడిగావున్న ఏసుబాబు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ వైపు పనిచేశాడు. ఈ నేపథ్యంలో ఘటనలో రాజకీయ కోణం ఏమైనా ఉందా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు

- మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్
- ఉద్యాన శాఖ అధికారి మోహన్

మాచవరం, ఆగస్టు 5: ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి మోహన్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఉద్యానశాఖ వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో సంయుక్తంగా ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ పల్నాడుజిల్లాలోని 8 మండలాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేసుకోవడానికి భూములను గుర్తించామన్నారు. మాచవరం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా 6 ఎకరాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆయిల్‌ఫామ్ మొక్కల ఖరీదుపై 100 శాతం రాయితీ లభిస్తుందని, ఒక హెక్టార్‌కు 157 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు 193 రూపాయలు, దేశీయ మొక్కలకు 133 రూపాయలు చొప్పున రూ.29 వేలు రాయితీ పొదవచ్చని అన్నారు. అంతేకాకుండా ఒక హెక్టార్‌కు 50శాతం రాయితీపై నాలుగు సంవత్సరాలకు గాను రూ.21వేలు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అంతర్ పంటల సాగుకు నాలుగేళ్లలో మరో రూ.21 వేలు రాయితీ లభిస్తుందన్నారు. బిందు సేద్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు నియమ నిబంధనల ప్రకారం ఆయిల్ ఫామ్ సాగుచేస్తున్న రైతులు డ్రిప్ ఇరిగేషన్ పెట్టుకోవాలని సూచించారు. మాచవరం మండలంలో సుమారు 12 ఎకరాలలో ఆయిల్‌ఫామ్ పంటలు సాగుచేయడం జరుగుతుందని పల్నాడు జిల్లా ఏరియా మేనేజర్ ఎం నవీన్, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్‌వి నాగరాజులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌కు మంచి డిమాండ్ వుందని, ప్రతి ఒక్క రైతు ఆయిల్‌ఫామ్ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అసిస్టెంట్లు ప్రభాకర్, పిన్నెల్లి, శ్రీరుక్మిణీపురం, కొత్తగణేశునిపాడు, కొత్తపాలెం, మాచవరం, మోర్జంపాడు, మల్లవోలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటుతున్న ఉద్యానశాఖ అధికారి, తదితరులు



న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయాధికారి మురళీగంగాధరరావు తదితరులు

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

పిడుగురాళ్ల, ఆగస్టు 5: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కళ్లంటౌన్‌షిప్‌లోని స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఎం.మురళీగంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అలాగే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు రమేష్, ఎం.శ్రీనివాసరావు, జాకబ్, నాగార్జున, పలుశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గుంటూరు, మంగళగిరికి చెందిన న్యాయవాదులు నాగరాజు, గవాస్కర్‌పై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం గురజాల న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు కేవీ నాగార్జున, కలివెల ప్రభుదాసు, జీవీ రాధాకృష్ణమూర్తి, కె శ్రీనివాసరావు, కనకం ఆదినారాయణ, షేక్ జానీబాష, కొమెర హరిసత్యనారాయణ, లింగరాజు పలువురు విధులను బహిష్కరించారు.

చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

గురజాలటౌన్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఏపీఎన్జీవోస్ రాష్ట మాజీ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఏపీఎన్జీవోస్ గురజాల నేతలు మండిపడ్డారు. సోమవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడవకముందే ఐఆర్ ఇవ్వలేదని అడుగుతున్న చంద్రశేఖరరెడ్డి మూడేళ్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి ఒక్క డీఏని ఇప్పించలేకపోయారని విమర్శించారు. కేవలం తన ఉనికి కోసమే ఆయన చవకబారు ఆరోపణలు చేస్తున్నాడని మండి పడ్డారు. కార్యక్రమంలో గురజాల ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు ఉన్నం హనుమంతురావు, సెక్రటరీ వేముల శ్రీనివాసరావు, కోశాధికారి సీహెచ్ అంకమ్మరావు, ఎస్ఎం రాజు, లక్ష్మీనారాయణ, జక్కా మల్లికార్జునరావు, వెంకటరమణి, శ్రీనివాసరావు, స్వప్న, పద్మావతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయండి

కారంపూడి, ఆగస్టు 5: మండల కేంద్రమైన కారంపూడిలో ఈనెల 8న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు కోరారు. సోమవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ఆమోదిస్తూ ఇచ్చిన తీర్పుపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మహాజన నేత మందాకృష్ణ మాదిగకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు తాళ్లూరి జీవరత్నం, గడ్డిపర్తి శ్రీనివాసరావు, కందుకూరి రమేష్, ఆదిరాల జక్రయ్య, చిన మల్లయ్య యాకోబు, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం బాటిళ్ల పట్టివేత

రాజుపాలెం,ఆగస్టు5:మండలంలోని అనుపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ వాసు ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన తెలంగాణ మద్యం 36 క్వార్టర్ బాటిళ్లను సత్తెనపల్లి సెబ్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు వాసు అందుబాటులో లేరని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంటసిబ్బంది శ్రీనివాసరావు, శ్యామ్ తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీల్లో డీపీవీ విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి, ఆగస్టు 5: ఆంధ్ర, కర్నాటక క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలలో దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలోని డీపీవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4న ఇబ్రహీం పట్నంలో జరిగిన రన్నింగ్, లాంగ్‌జంప్, డిస్క్ త్రో, షాట్‌పుట్, రిలే, వాలీబాల్, చెస్ ఈ క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన రావు మాట్లాడుతూ గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆరాధన మహోత్సవం

పెదకూరపాడు, ఆగస్టు 5 : మండలంలోని 75 తాళ్ళూరు అవధూత అయోధ్య స్వామి 19 ఆరాధన మహోత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అయోధ్య స్వామి విగ్రహానికి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

గ్రామాల్లో భాష్యం లావణ్య పర్యటన

క్రోసూరు, ఆగస్టు 5 : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య సోమవారం మండలంలోని గుడిపాడు, గరికపాడు, గాదెవారిపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందని వివరించారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి, విప్పర్ల మాజీ సర్పంచ్ కొండవీటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేట తహసీల్దార్‌గా వేణుగోపాల్



కొనికినేని వేణుగోపాల్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: నరసరావుపేట తహసీల్దార్‌గా కొనికినేని వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నరసరావుపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న హరిబాబు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. సెక్రటరేట్‌లో విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌ను నరసరావుపేటకు బదిలీఅయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో కొనికినేని వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు నూతన తహసీల్దార్ వేణుగోపాల్‌కు అభినందనలు తెలిపారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

● జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు నిర్దేశించిన సమయం లోగా పరిష్కరించాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి, పులిచింతల ప్రత్యేక కలెక్టర్ నారద ముని, డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు. నిర్దేశించిన సమయం దాటకుండా దరఖాస్తులను పరిష్కరించాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను దరఖాస్తు దారునికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 85దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

బ్రాహ్మణ కుటుంబానికి చేయూత



ఆర్థికసాయాన్ని అందిస్తున్న బ్రాహ్మణ పెద్దలు

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 5: మండలంలోని కారుమంచి గ్రామంలోని శివాలయంలో అర్చకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పేటేటి నాగ శ్రీరామమూర్తి(44) అనారోగ్యంతో నాలుగురోజులు క్రితం మృతిచెందాడు. వారి కుటుంబం నిలువనీడ లేక రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న వినుకొండ పట్టణానికి చెందిన కౌన్సిలర్ పీవీ సురేష్, మరికొందరు బ్రాహ్మణ పెద్దలతో కలసి సోమవారం కారుమంచికి విచ్చేసి వారికి భరోసా ఇచ్చారు. తక్షణసాయంగా మృతునికుటుంబసభ్యులకు బ్రాహ్మణ సంఘం తరఫున రూ.25వేలు ఆర్థికసాయాన్ని అందించారు. బాధిత కుటుంబం నివాసముండేందుకు రేకులషెడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. మృతుని సోదరి నాగకోమలి కుమార్తె షణ్ముఖసాయి అస్మిత 7వ తరగతి చదువుతుండగా వినుకొండలోని శర్మ స్కూల్ వ్యవస్థాపకులు శర్మ బాలికకు 10వతరగతి వరకు ఉచితంగా ఆశ్రమవిద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వినుకొండ కౌన్సిలర్ పీవీ సురేష్, మంత్రిరాజు సత్యనారాయణ, గాలి శ్రీనివాసరావు, శర్మ, అప్పరాజు నాగేశ్వరరావు, బాగవతుల రవికుమార్, ముటుకుల శివకుమార్, యడవల్లి శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేశారంటూ టీడీపీ నేత ఆరోపణ

వినుకొండ టౌన్, ఆగస్టు 5: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండటంపై అధికారులకు ఫిర్యాదు చేసి అడ్డుకోవటంతో తనపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారని నూజండ్ల మండలం కొత్త నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లేళ్ళ వెంకటేశ్వర్లు సోమవారం ఆరోపించారు. బాధితుడు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 10గంటల సమయంలో వినుకొండ నుంచి ద్విచక్రవాహనంపై నూజండ్ల మండలం కొత్తనాగిరెడ్డిపల్లి గ్రామానికి వస్తుండగా చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద తన ద్విచక్రవాహనంను వెనుక నుంచి కారులో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టేందుకు యత్నించారని, దీనిని గమనించి తాను ద్విచక్రవాహనాన్ని పొలంలోకి మళ్లించానన్నారు. తాను బంధువులకు సమాచారం అందించటంతో వారు చింతలచెరువుపైపు పారిపోతున్న కారును వెంబడించారని, చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద కారు డ్రెయిన్‌లోకి దిగబడటంతో, దుండగులు కారును, మొబైల్ ఫోన్లను వదిలి పరారయ్యారన్నారు. జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కత్తి పద్మలత కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారన్నారు. దీనిపై సీఐ శోభన్‌బాబును వివరణ కోరగా, వెంకటేశ్వర్లు చెప్పేది బూటకమని కొట్టిపారేశారు. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయలేదని, పూర్తి వివరాలను ఆరా తీస్తున్నామన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో-2 లలితకుమారి తనిఖీ

శావల్యాపురం, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఎండీఎం ఆపరేటర్‌లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి అన్నారు. మండలంలోని కొత్తలూరు, తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాలలను ఆమె సోమవారం తనిఖీచేశారు. కొత్తలూరులో కొంతమంది విద్యార్థులలో విద్యాప్రమాణాలు తక్కువగా ఉండడాన్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వమందించిన స్కూల్‌కిట్స్ విద్యార్థులందరికీ పంపిణీచేసి ప్రతిరోజూ వాటిని ధరించి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని హెచ్ఎంకి తెలిపారు. తుమ్మలకుంటలో మధ్యాహ్న భోజనం వాసనగా ఉండడాన్ని గుర్తించిన ఎంఈవో పలు సూచనలు చేశారు. అనంతరం ఈ నెల 8న పాఠశాలలలో జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను పరిశీలించారు. హెచ్ఎంలు రాజారమేష్, వీరాంజనేయులు, సీఆర్పీ ఎలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ పి మస్తానమ్మ

నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● వ్యవసాయ శాఖ ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: రైతులకు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి సరైన ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విత్తన ఉత్పత్తి పథకం ప్రారంభించిందని వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. మండలంలోని పెట్లూరువారిపాలెం రైతు సేవా కేంద్రంలో సోమవారం గ్రామ విత్తన ఉత్పత్తి పథకంపై మొదటి దఫా శిక్షణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ నరసరావుపేట మండలంలో ప్రస్తుతం వేసేందుకు వీలున్న విత్తనాలు, వాటి లభ్యత గురించి రైతులకు అవగాహన కలిగించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎమ్.శివకుమార్ పథకం ఆవశ్యకత గురించి చెబుతూ, మంచి విత్తనం వాడితే 15% అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. డీఆర్సీ ఏవో ప్రవీణ్ విత్తన తరగతులు ఫౌండేషన్ విత్తనం లక్షణాలు, కలిగే ఫలితాల గురించి వివరించారు.

అఖిల భారత సదస్సును విజయవంతం చేయాలి

● ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు ఏడుకొండలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: ఈ నెల 9, 10 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న అఖిల భారత సదస్సును విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దీనిపై సోమవారం నరసరావుపేట ఎన్‌జీవో హోంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గడిచిన ఏడు నెలల కాలంగా కనీసం రెండు వందల మంది ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో హతమార్చడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగిస్తున్న మానవహననాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులు జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిగిందన్నారు. ప్రజాస్వామిక వాదులు వందలాది మంది పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో కె కృష్ణ రాష్ట్ర కార్యదర్శి కుల నిర్మూలనా పోరాట సమితి, జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య ప్రసాదరావు, ఆర్.రవిబాబు, చందు, తేజ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 5: విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, క్రమ శిక్షణతో మెలగాలని, చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆకాంక్షించారు. స్థానిక జూనియర్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు, నోట్‌బుక్స్, బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే పంపిణీ చేసిన ఉచిత పుస్తకాలను, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైతం పంపిణీ చేపట్టడం శుభపరిణామం అన్నారు. దీనిపై విద్యార్థులు పెద్దఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసే స్కాలర్‌షిప్‌లను మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరుతో పంపిణీ చెయ్యడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని విద్యార్థులు కోరగా, వారి సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా బొల్లాపల్లి మండలం కనుమల చెరువుకు సాయంత్రం పూట ఆర్టీసీ బస్సు ఏర్పాటుచేయాలని విద్యార్థులు కోరగా, వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు, టీడీపీ నాయకులు పీవీ సురేష్, అయూబ్‌ఖాన్, కృష్ణ, కౌన్సిలర్ పులినాగరాజు, ప్రశాంత్, గంధం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 5: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ రాఘవేంద్ర ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు నరసరావుపేట పట్టణంలోని 12వ వార్డు షాలెంనగర్‌కు చెందిన కుంజానంద ఒక సెంటున్నర స్థలాన్ని పట్టణంలోని అరండల్‌పేటలో 2011 సంవత్సరంలో కొనుగోలు చేశారని సదరు స్థలంలో అద్దెకు ఇచ్చేలా రేకుల షెడ్డు నిర్మించానని, ఆ షాపులను వైసీపీ నాయకులు తాళాలు పగలగొట్టి ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల మండలం చెందిన అచ్చి వీరయ్య అతని భార్యను అతను చిన్న కుమారుడు ఆస్తి పంచమని లేకుంటే చంపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. నకరికల్లు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు కుమారులు వాళ్ల పేరు మీద ఇల్లు రాయమని వేధిస్తున్నారని లేకుంటే ఇంట్లో నుంచి వెళ్లిపోమని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. నూజెండ్ల మండలం మూర్తిజాపురం గ్రామంలో నివాసముండే శీలం గోవిందు తనకు సంబంధించిన ఆముదాల పంట పొలంలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే అతను సుమారు 40సెంట్లు నాశనం చేసి ఆక్రమించుకుని హద్దురాళ్లను పీకివేసినట్లు ఫిర్యాదుచేశారు. ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామానికి చెందిన ప్రమిత తన భర్త ఆర్మీ ఉద్యోగం చేస్తూ రిటైరయ్యారని, తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. మాచర్లకు చెందిన మల్లేశ్వరరావు ఉద్యోగం ఇప్పిస్తానని బద్యానాయక్‌ను నమ్మబలికి రూ.5లక్షల రూపాయలు తీసుకొని మోసం చేసినట్లు ఫిర్యాదు చేశాడు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ని గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని షాదీఖానాలో సోమవారం జరిగిన సీపీఐ పల్నాడు జిల్లా కార్యకర్తల సమావేశంలో ముప్పాళ్ళ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీపీఐ శత వసంతాల వేడుకలకు సిద్ధమవుతోందని ఇందులో భాగంగా దేశ రాజకీయ పరిస్థితులను సమీక్షించి సీపీఐ ప్రజల పార్టీగా బలోపేతం చేసేందుకు జాతీయ, రాష్ట్ర పార్టీలు నిర్ణయించాయన్నారు. రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఏరియా కమిటీ కార్యదర్శులు మందపాటి రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్వాతి, నిర్మల, సుబ్బాయమ్మ, బాబురావు, బి.శ్రీను, ఉలవపూడి రాము, సత్యనారాయణరాజు, ఇర్మియ, మునుగోటి శ్రీను, కోటేశ్వరరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే ఘన నివాళి



విప్పర్లలో యువకుడి భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల, ఆగస్టు 5: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన రోహిత్, బాల ప్రసన్న రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లో మృతిచెందారు. వారి భౌతిక కాయాలు విప్పర్లకు ఆదివారం వచ్చాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం విప్పర్ల గ్రామానికి వెళ్ళి మృతుల భౌతిక కాయాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట తెలుగుదేశ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

విధులకు న్యాయవాదుల గైర్హాజరు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 5: గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపుమేరకు స్థానిక న్యాయవాదులు సోమవారం విధులకు గైర్హాజరయ్యారు గుంటూరుకు చెందిన నాగరాజు మంగళగిరి చెందిన గవాస్కర్లపై పోలీసులు అన్యాయంగా అక్రమ కేసులు బలాయించాలని నిరసిస్తూ జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఆ పిలుపు మేరకు స్థానిక న్యాయవాదులు సోమవారం విధులకు గైర్హాజరయ్యారు.

విద్యార్థులకు జలజీవన్ మిషన్‌పై అవగాహన

రొంపిచర్ల, ఆగస్టు 5: మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో జల జీవన్ మిషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా కో-ఆర్డినేటర్ రంగారావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ద్వారా సురక్షితమైన 55లీటర్ల తాగునీరు అందించటం జరుగుతుందన్నారు. తాగునీటి పథకాలు లేనిచోట నూతన పథకాలను అందజేస్తామన్నారు. గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంరక్షణ కేంద్రాలకు ఉచితంగా తాగునీరు అందజేస్తారన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించటం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఫీల్డ్‌టెస్ట్ కిట్ ద్వారా నీటి నాణ్యత పరీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయమ్మ, పడాల చక్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, జలజీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ తేజ్ సంగీత్, స్వచ్ఛ భారత్ జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్, మండల కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన ర్యాలీ

యడ్లపాడు, ఆగష్టు 5: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా 5వ రోజైన సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సదస్సును నిర్వహించారు. మండల కేంద్రమైన యడ్లపాడులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ విజయశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి గ్రామంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రచెరువులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, ఈవోపీఆర్డీ వరూధిని, సీడీపీవో శాంతకుమారి, ఏసీడీపీవో నిర్మలరాణిలు మాట్లాడుతూ తల్లి పాల ప్రాధాన్యం, పిల్లలకు కలిగే మేలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జోజమ్మ, పార్వతి, వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హైవేపై డీజిల్ దొంగతనాలు

రొంపిచర్ల, ఆగస్టు 5: మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై డీజిల్‌ను దొంగిలించే ముఠా తిరుగుతోంది. గతంలో కూడా ఈ విధంగా దొంగతనాలు జరిగాయి. అప్పట్లో కొన్ని ఆధారాలతో వారిని పోలీసులు పట్టుకున్నారు. మరలా కొద్ది రోజుల నుంచి దొంగతనాలు ప్రారంభమయ్యాయి. పెట్రోల్ బంకులు, హైవే పక్కన ఆగి ఉన్న లారీల ట్యాంకుల నుంచి డీజిల్‌ను దొంగిలిస్తున్నారు. కారులో వచ్చిన వ్యక్తులు చాకచక్యంగా డీజిల్‌ను దొంగిలిస్తున్నారు. రొంపిచర్లలోని హైవేపై ఉన్న పెట్రోల్ బంకుల వద్ద రెండు రోజుల క్రితం లారీ ట్యాంక్ నుంచి డీజిల్‌ను దొంగిలించారు. దీంతో డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. హైవేపై పోలీసులు బీట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఈ విధంగా జరగటం గమనార్హం. కొద్దిరోజుల క్రితం రొంపిచర్లలో పాటేళ్లను దొంగిలించారు. పొలాల్లో మిర్చి, ద్విచక్ర వాహనాలను దొంగిలించుకుపోయిన దాఖలాలు ఉన్నాయి. ఇటువంటి ఘటనలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

జీవో నెంబరు 117ను రద్దుచేయాలి: యూటీఎఫ్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 117ను రద్దుచేయాలని ఉపాధ్యాయ సంగం యూటీఎఫ్ నాయకులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. లోపభూయిష్టమైన ఈ జీవోను రద్దుచేసి కూటమి నాయకులు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. జీవోను రద్దు తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమం చేపట్టాలని కోరారు.

12 మంది వేల్పూరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

వేల్పూరు (శావల్యాపురం) ఆగస్టు 5: మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యున్నతమైన ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించడమే కాక ట్రిపుల్ ఐటీలో 12 సీట్లు సాధించి జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచారని పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ సోమవారం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నిర్వహించిన ట్రిపుల్ ఐటీ మొదటి కౌన్సిలింగ్‌లో పాఠశాల విద్యార్థులు పొత్తూరి భువన సాయిసుభాష్, దూళ్ళ సంతోష్, అద్దంకి పవన్‌కుమార్, మర్రి యశోధర్, గోరంట్ల యామిని, బొల్లా అనుపమ, నన్నెబోయిన సాయిత్రిష, గాలం యశ్వంత్ బాజీ, బొల్లా వర్షిత, సగినాల వైష్ణవీలు సీట్లు సాధించగా, రెండో కౌన్సిలింగ్‌లో జూపల్లి దీక్షిత, గాలం ఝాన్సీలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు తెలిపారు. ఒకే విద్యాసంవత్సరంలో 12మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం శుభపరిణామమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సంలో కూడా పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులను జడ్పీటీసీ పారా హైమావతి, హెచ్ఎం సుభానీ, పీడీ కాకుమాను రాజేష్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, ఆగష్టు 5: పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు నమోదైన కేసులో నిందితులైన పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన కొల్లిపర నాగరాజు, కొల్లిపర సాయి కుమార్‌లకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవళిక సోమవారం ఉత్తర్వులు జారీచేశారు ఆదివారం రాత్రి 11గంటలకు సమయంలో గుంటూరుకు చెందిన బషీర్ అనే వ్యక్తి నకరికల్లు వెళుతూ నరసరావుపేట గడియారస్తంభం వద్దకు రాగా పట్టణానికి చెందిన యువకులు నాగరాజు సాయికుమారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ వచ్చి అతని ఢీకొట్టారు. అనంతరం బషీర్‌పై దౌర్జన్యానికి దిగటంతో నిందితులను విధి నిర్వహణలో ఉన్న పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకున్న యువకులు మోటార్ సైకిల్‌ను బలవంతంగా తీసుకొని వెళ్లారు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేశామన్నారు న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టెండర్లలో అన్యాయం జరిగిందని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా

నరసరావుపేట లీగల్, ఆగష్టు 5: తనకు స్లీపింగ్ టెండర్‌లో అన్యాయం జరిగిందంటూ తగు న్యాయం చేయాలని సత్తెనపల్లికి చెందిన వై.శ్రీనివాసరావు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డీఎం కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. టెండర్లు పిలవాలంటే వారు ముందుగా నోటీసు జారీ చేయాల్సి ఉంటుందని కానీ సత్తెనపల్లిలో కేవలం రెండు రోజులు ముందే టెండర్లకు నోటీస్ జారీ చేశారని ఒకే వ్యక్తికి అన్ని కాంట్రాక్టులు కట్టబెట్టారని పాల్పడ్డారని అయన ఆరోపించారు. సక్రమంగా విచారణ జరిపి అన్యాయంగా ఖరారుచేసిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్లపై చర్యలు తీసుకోకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ ధర్నాకు దిగాడు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం వీరస్వామిని వివరణ అడుగగా గత నెల మూడవ తేదీని అన్ని డిపోలకు టెండర్లు పిలవాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ నెల నాలుగో తేదీన టెండర్ విషయమై పేపర్లు అంటించామన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగిందనిపిస్తే తమ దృష్టికి తెస్తే ప్రక్రియలో విచారిస్తామన్నారు. బాధితుడు శ్రీనివాసరావు డీఎంతో చర్చలకు రాకుండా కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడంతో డీఎం వీరస్వామి ఈ విషయాన్ని మొదటి పట్టణ సీఐ దృష్టికి తీసుకెళ్లారు. సీఐ డిపోకు వచ్చి విచారణచేసి వెళ్లారు.

బీసీ స్టడీ సర్కిల్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

● బీసీ నాయకుడు కొల్లిపర బాలాజీ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5: బడుగు బలహీనవర్గాల విద్యార్థినీ, విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీసీ నాయకులు కొల్లిపర బాలాజీ కోరారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో బడుగు బలహీనవర్గాల విద్యార్థినీ, విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాగా ఉన్నప్పుడు గుంటూరులో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ గత ప్రభుత్వం మూసి వేసిందన్నారు. దీనివలన పోటీ పరీక్షలలో ప్రతిభఉన్న బీసీ పేద విద్యార్థులు పాల్గొనలేకపోతున్నారు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నతమైన ఉద్యోగాలకు కోచింగ్ కోసం, దూర ప్రాంతాలకు వెళ్లి లక్షల రూపాయలు డబ్బు చెల్లించే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసిన ఉచితంగా కోచింగ్ ఇచ్చి బలహీనవర్గాల కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కొల్లిపర బాలాజీ, దొమ్మాటి మల్లికార్జునరావు, సిద్దు అనంత నాగబ్రహ్మచారి, ప్రసాదు, వి.శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలను దానంచేసిన మృతుల కుటుంబ సభ్యులు

రొంపిచర్ల, ఆగస్టు 5: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన కందుల రోహిత్, ఉడత బాలప్రసన్న హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదానికి గురై రెండు రోజుల క్రితం మృతిచెందారు. కుటుంబసభ్యుల అనుమతితో ఇద్దరి నేత్రాలను దానం చేశారు. నేత్రాలను దానంచేసిన కుటుంబసభ్యులను గ్రామస్థులు అభినందించారు.



వేల్పూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ శివకుమారి

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి

వేల్పూరు (శావల్యాపురం) ఆగస్టు 5: వాతావరణం, నేల, నీరు వంటివి కలుషితం కాకుండా నివారించేందుకు రైతులు తాము సాగుచేసే భూమిలో కొంత భాగమైనా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మొగ్గుచూపాలని జిల్లా వనరుల కేంద్రం శిక్షణ కో-ఆర్డినేటర్ శివకుమారి అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించి వాటికి అనుగుణంగా ఎరువులను వాడుకోవాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులను ఎక్కువగా వాడాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను వరి పంటకు ఆఖరు దమ్ములో, మెట్టపంటకు ఆఖరి దుక్కిలో వేయాలని, లేకుంటే వరినాటు వేసిన పదిరోజులలోపు, మెట్టపంటకు విత్తనాలు నాటిన నెలరోజుల లోపు వేయాలన్నారు. పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులకు ప్రభుత్వం సర్టిఫికెట్లు మంజూరు చేస్తుందని, తద్వారా రైతులు పండించిన పంటలను ఎక్కువ ధరలకు అమ్ముకోవచ్చన్నారు. జడ్పీటీసీ పారా హైమావతి, ఎంపీటీసీ లింగా పున్నమ్మ, ఇన్చార్జి సర్పంచ్ రత్నప్రభ, డీఆర్సీ ఏవో పల్లపోతు ప్రవీణ్, ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఏఈవో పూరేటి అశోక, వీఏఏలు హరిబాబు, అనూష తదితరులు పాల్గొన్నారు.

8న పెద్ద కంచర్లలో వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వినుకొండ టౌన్, ఆగస్టు 5: మండలంలోని పెద్ద కంచర్లలో ఈ నెల 8వ తేదీన గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో గణపతి, వరాహ, గరుడ, శ్రీదేవి, గోదాదేవి, వెంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన శ్రీమాన్ పరాశరం శ్రీ రంగానాథాచార్యులు హోమం పూజ కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభించారు.

వేణుగోపాలస్వామి వారికి వెండి వస్తువుల బహూకరణ

నాదెండ్ల, ఆగస్టు 5: మండలంలోని గణపవరంలో రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో సోమవారం శ్రావణ మాస పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవారికి కొల్లా హేమంత్ బాబు వారి సతీమణి కృష్ణతారకంలు వెండి వక్ష స్థలాలు బహూకరించారు. ఆలయ ధర్మకర్తలు అనుమంచి శరవణ్‌కుమార్, పూజారి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో గీతా సమాజం వారు వీటిని బహూకరించారు.

ఉపాధి హామీ పనులపై విచారణ జరిపించాలి

నాదెండ్ల, ఆగస్టు 5: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై విచారణ జరిపి న్యాయం చేయాలని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. నీరు ఉన్న చెరువులో పనులు చేసినట్టు హాజరు వేసుకొని ఉపాధి సొమ్ము దుర్వినియోగం చేశారని ఆరోపించారు.